



ఆయింట్లో ఒక అత్తగారు, కొత్త కోడలు ఉంటున్నారు.

ఆ యింట్లోనే ఒక పాతకారు, కొత్త స్కూటరు ఉన్నాయి.

ఆ యింట్లో యింకా మనుమలున్నారు కానీ వారి ఉనికికి ప్రాముఖ్యత లేదు. ఆ యింట్లో జరిగే ప్రతి విశేషానికి సూత్రధారులుగా వ్యవహరించే వ్యక్తులు, వస్తువులు, అత్త, కోడలు, స్కూటరు.

అత్తకు భర్త నారాయణరావు యూనివర్సిటీలో ప్రొఫెసరుగా చేసి రిటైరయ్యాడు. కోడలి భర్త రామారావు యూనివర్సిటీలో లెక్చరరు. నారాయణరావు ఆఖరి కొడుకు రామారావు. తను రిటైరైనచోటనే ఉండడంవల్ల ఆయన ఆఖరి కొడుకువద్దనే ఉంటున్నాడు.

అత్త పేరు విమల. వయసు పెద్దదైన కారణంగా అంతా విమలమ్మగారంటారు. కోడలి పేరు శాంతమ్మ. వయసు కారణంగా అంతా ఆమెను శాంత అనిపిలుస్తారు.

శాంత అందమైనది, తెలివైనది, చురుకైనది. అన్నింటికీమించి ఆమె విమలమ్మ ఎన్నిక. ఒక పెళ్ళిలో శాంతను చూసి తనకొడుక్కు ఈడూజోడూగా ఉంటుందనిపించి కట్నంలేకుండా ఆమెను పెళ్ళి చేసుకునేందుకి ఒప్పించింది విమలమ్మ. అందుకని శాంతక్కూడా అత్తగారంటే ఎంతో యిష్టం.

కాపురానికి వస్తూనే శాంత తన అందాన్ని భర్తపైనా, తెలివిని అత్తమామలపైనా, చురుకుతనాన్ని ఇంటి పనులమీదా ప్రయోగించి మాసంరోజుల్లోనే ఆయింట్లో శాంత లేకపోతే ఎలా అన్న అభిప్రాయాన్ని అందరికీ కలిగించింది. చుట్టుపక్కల వారందరూ విమలమ్మ ఎన్నికను మెచ్చుకుంటుంటే ఆమె ఎంతో గర్వపడేది.

ఇలా ఎంతో కాలం జరగలేదు.

విమలమ్మకు పుస్తకాలంటే ప్రాణం. అందులోనూ పంటింటి సాహిత్యం ఆమెకు మరీ యిష్టం. దానికితోడు రెండేసి రోజులకోసారి ఇంటికివచ్చి పుస్తకాలిచ్చి పోతుండే పేపరు కుర్రాడు కూడా ఉన్నాడు. కానీ విమలమ్మ భర్త నారాయణరావు ప్రొఫెసరుగా యూనివర్సిటీలో విద్యార్థులకి క్షణం తీరికలేకుండా పని కల్పించి మళ్లీ ఇంట్లో భార్యక్కూడా పనులు కల్పించేవాడు. ఆయనకు మంచినీళ్లు కావాలంటే వంటింట్లో రిఫ్రిజరేటరుదాకా వచ్చి అక్కడే ఉన్న భార్యకావిషయం చెప్పి మళ్లీ తనగదిలోకి వెళ్ళిపోయేవాడు. తన మంచినీళ్ళు తను తీసుకోకపోయినా కనీసం అక్కడే నిలబడితే పని సుకరమయ్యేదని విమలమ్మ విసుక్కునేది. ఏమైతేనేం తృప్తిగా పుస్తకాలు చదువుకునేందుకు వీలయ్యేదామెకు. చాలా సీరియల్ నవలలనామె తర్వాత నెమరు వేసుకోవచ్చు అన్నట్లు ఆదరాబాదరాగా చదివేసేది. నెమరు వేసుకునేందుకామెకు సమయమూ చిక్కేది కాదు.

శాంత వచ్చేక విమలమ్మకు బొత్తిగా పనిలేకుండా పోయింది. మామగారి అవసరాలు కూడా శాంత తనే చూసేది. మొదట్లో కాస్తయిబ్బంది పడ్డప్పటికీ క్రమంగా నారాయణరావుకదే బాగుందనిపించింది. భార్య మాటల్లో అగౌరవం, చేతల్లో ఉండే నిర్లక్ష్యం—ఈ రెంటి నించీ తప్పించుకోవడంవల్ల ఆయనకు కోడలంటే అభిమానం కూడా పెరిగింది.

విమలమ్మ యిప్పుడు చిన్న చిన్న యింటిపనులు కూడా మానేసి తన సమయాన్ని పుస్తక పఠనానికీ, పొరుగిళ్ళ పెత్తనాలకీ ఉపయోగించుకుంటోంది. అందువల్ల తనేం నష్టపోతున్నదీ ఆమెకు వెంటనే తెలియలేదు.

ఒకప్పుడు విమలమ్మ ఆ యింటి యజమానురాలు. ఆ యింట్లోకి రావాలనుకున్న వెలుతుర్నీ వీచాలనుకున్న గాలినీ కూడా ఆమె శాసించగలిగేది. క్రమంగా శాంత ఆ యింటి యజమానురాలైపోతోంది. ఆ యింటికి వచ్చే



పాలవాడు, చాకలి, పనివాళ్ళు వగైరాలందరూ విమలమ్మ ఉనికిని గుర్తించడం మానేశారు. శాంత తన ఎన్నిక అని విమలమ్మ అనుకుంటోంది. కానీ శాంత ఆ యింట్లో వ్యక్తిత్వాన్ని సంతరించుకుంటోంది. అప్పుడే కొందరు విమలమ్మను శాంత అత్తగారంటున్నారు.

ఈ విషయం గ్రహించగానే విమలమ్మ ఇంటి పరిస్థితులను మరింత తీక్షణంగా పరిశీలించింది.

ఒకప్పుడు ఇంట్లో ఉన్న ప్రతిక్షణమూ తన్ను పిలుస్తుండే భర్త ఇప్పుడదేనోటితో కోడల్ని తప్ప పిలవడంలేదు. 'అమ్మా అమ్మా' అంటూ తన చుట్టూతిరిగే కొడుకిప్పుడు కోడలికొంగు పట్టుకుని ఆమె చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నాడు.

విమలమ్మ యిది సహించలేక, "ఎల్లకాలమూ మీకు కోడలే సేవలు చేసిందా? ఇంట్లోనేనంటూ ఓ మనిషినున్నానని మర్చిపోయేరా?" అని భర్తను నిలదీసి అడిగింది.

"అమృతం రుచి చూసినవాడికి నాటుసారా నచ్చుతుందా? ఇన్నాళ్ళకు నాకు నీ సేవల్నించి తప్పించుకునే అవకాశం వచ్చింది. నువ్విక నాజోలికిరాకు. హాయిగా తినికూర్చుని పుస్తకాలు చదువుకో" అన్నాడు నారాయణరావు.

తనింట్లో ఏ పనీచేయకుండా పుస్తకాలు చదువుకుంటూండడంవల్ల అందరికీ అలుసైపోయానని విమలమ్మ గ్రహించింది. మళ్లీ యింటిపనుల్లో వేలుపెట్టాలని ఆమె అనుకుంది. కానీ బద్ధకాన్ని ఆహ్వానించడంవరకే మనవంతు. వదిలించుకోవడం అంత సులభం కాదు.

విమలమ్మ బాగా ఆలోచించింది. ఇంటి పనులు చేయకుండా ఇంట్లో అందరి సానుభూతి సంపాదించడానికి తనేం చేయాలి?

అనారోగ్యమొక్కటే అందుకు మార్గమని ఆమెకు తోచింది. తనేపనీ చేయడంలేదంటే అందుక్కారణం తన అనారోగ్యం అని ఆమె మనసును సరిపెట్టుకోసాగింది. ఇంట్లో అందర్నీ ఆకర్షించడం కోసం ఆమె ఒకరోజున గుండెనొప్పి వచ్చిందని పెద్ద హడావిడిచేసింది. రామారావు కంగారుపడి ఫామిలీ డాక్టర్ని పిలిచాడు. ఆయన విమలమ్మను పరీక్షించి ఆమెకి ఏ అనారోగ్యమూ లేదని నిర్ధారించాడు. రామారావుని పక్కకుపిలిచి, "ఈ వయసులో కొందరికి, ముఖ్యంగా ఆడవాళ్ళకి, పిల్లలు తమను నిర్లక్ష్యం చేస్తున్నారని అనుమానముంటుంది. నువ్వు మీ అమ్మకు అలాంటి భావంవల్ల కలక్కుండా చూసుకుంటే ఆమెకు మళ్ళీ అనారోగ్యంరాదు" అని చెప్పాడు.

రామారావ్ ఈ విషయం బాగా గుర్తుపెట్టుకున్నాడు. ఆతర్వాత నుంచి తల్లి అనారోగ్యం ప్రసక్తి తీసుకువచ్చినప్పుడల్లా అతడామెకు నాలుగు మంచి మాటలు చెప్పేవాడు తప్ప డాక్టర్ని తీసుకొచ్చేవాడు కాదు. ఒకసారి ఆమెకు నిజంగానే ఏ కడుపులో పోట్లోవస్తే గృహవైద్యంతోనే సరిపెట్టుకోవలసి వచ్చేది. కొడుకు మంచి మాటలు చెబుతున్నాడని విమలమ్మ కొంతకాలం సంతోషించింది. కానీ అతడు తన్ను నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆమెకు అనుమానం వచ్చే సంఘటనలు చాలా జరిగాయి.

శాంత ఒకసారి తల నొప్పంది. రామారావు డాక్టర్‌కి ఫోన్ చేశాడు. ఒకసారి శాంత కడుపులో పోట్లంది. డాక్టరుకి రావడం వీలుకాదంటే రామారావు తనే డాక్టరింటికి వెళ్ళాడు ఆతర్వాత యిలాంటి సంఘటనలు చాలా జరిగాయి.

విమలమ్మ కాలుజారి పడింది. లేవడమే కష్టమైతే కొడుకామెకు మంచి మాటలు చెప్పి నాలుగురోజులపాటు సేవలు చేశాడు. అదే శాంత జారిపడితే వెంటనే హాస్పిటల్‌కి తీసుకెళ్ళి ఎక్స్‌రే తీయించాడు.

విమలమ్మకు సహించడం కష్టంగానే ఉంటోంది. అసహనం హెచ్చుమీరిపోతోంది. కానీ కోడలినేమీ అనలేకపోతోంది. అకారణంగా కోడల్నితిడితే నారాయణరావు ఊరుకోడు. ఇందులో కొడుకును తప్పుపట్టాల్సిందేమీ లేదనీ, అంతా కోడలి మాయ అనీ ఆమె అనుకుంటోంది. కోడలి మాయనెలా ఛేదించాలీ అని ఆలోచించగా ఆమెకో ఉపాయం తట్టింది.

కట్నం తీసుకోని అల్లుడికి బహుమతిగా స్కూటరిచ్చాడు మామగారు. ప్రతిరోజూ సాయంత్రం ఆ స్కూటరు మీద రామారావు, శాంత విహారానికి వెళతారు. ఆ విహారంకోసమే శాంత యింటిపనులన్నీ చురుగ్గా చేస్తుంది.

ఆ స్కూటరు శాంతది. స్కూటరామెకు గర్వకారణం.

ఒకరోజున విమలమ్మ కొడుకుని పిలిచి, "నిత్యం ఇంట్లో కూర్చోవడంవల్ల ఆరోగ్యాలు పాడౌతాయి. మనం మొత్తం నలుగురంమాత్రం. సాయంత్రాలంతా కలిసి ఏ బీచీకో వెళ్ళి కాసేపు గడిపివస్తే ఉల్లాసంగా ఉంటుంది. కారు బైటికితీయి" అంది.

"అమ్మా! అది పాతకారే. రెండురోజులు వాడితే నాలుగు రోజులు రిపేర్. పైగా పెట్రోల్ విపరీతంగా తాగేస్తుంది. మనం మధ్యతరగతి వాళ్ళం. కారు భరించలేం. స్కూటరే గతి" అన్నాడు రామారావు.

"ఏం—మీ నాన్నగారు కారు వాడ్డంలేదా? ఇప్పటికీ ఆయన బ్యాంకుపనులు కారుమీదే వెళ్ళి చేసుకుంటారు" అంది విమలమ్మ.

"నీకు తెలియదేమో! కారు వాడకం తగ్గించాక నాన్నగారి, ఆర్థికపరిస్థితి బాగుపడిందిట. దానిమీద వాత్సల్యంకొద్దీ ఆయన దాన్నమ్మడంలేదంతే! వాడకపోతే రిపేరుకొస్తుందని వారానికోసారి కారు తీస్తారు తప్ప నాన్నకూ కారంటే యిష్టంలేదు" అన్నాడు రామారావు.

విమలమ్మ ససేమిరా అంది. ఫలితంగా రామారావు కారు తీయకతప్పలేదు. అయితే రెండురోజుల్లోనే దానికి రిపేరొచ్చింది.

రామారావు రిపేరు చేయించడంలేదు. ఫలితంగా నారాయణరావు బ్యాంకుపనులు కూడా అతడే స్కూటరు మీద వెళ్ళి చేసుకుని వస్తున్నాడు.

కారు రిపేరు చేయించ మని విమలమ్మ గోలపెడుతోంది.

కారైతే తనది. కొడుకు, కోడలు తన వాహనాన్ని ఉపయోగించుకోవడంవల్ల తన అధార్టీ నిలబడుతుందని విమలమ్మ ఆశ.

అందుకని ఆమె మాటిమాటికీ స్కూటర్ని చిన్నబుచ్చి తమ హోదాకు కారు వాడితీరాలనసాగింది.

అయితే రామారావామె మాటలు నిర్లక్ష్యం చేశాడు. ఏదో కుంటిసాకు చెప్పి కారు రిపేరు వాయిదావేస్తున్నాడు.

విమలమ్మక్కోపం వచ్చి స్కూటర్ని శాపనార్థాలు పెట్టసాగింది. ఆమె శాపనార్థాలు ఫలించనే ఫలించాయి ఒకరోజున.

శ్రావణ శుక్రవారానికి చీరలు కొనాలని శాంత అనుకుంది. అత్తగారు కూడా రావాలని పట్టుబట్టింది. తను రిక్షా ఎక్కనని విమలమ్మ మొండిపట్టుపట్టింది. రామారావు శాంతను ముందుగా బట్టలషాపులో దిగవిడిచి వచ్చాడు. తర్వాత తల్లిని స్కూటరు మీద తీసుకుని వెళ్ళాలనుకున్నాడు.

"దిక్కుమాలిన స్కూటరు. కారైతే ఒక ట్రిప్పులో అంతా వెళ్ళిపోయేవాళ్ళం" అంటూ విమలమ్మ వీధిలోకి వచ్చింది.

రామారావు కిక్కిస్తే స్కూటరు స్టార్టుకాలేదు.

అప్పుడు విమలమ్మకు కలిగిన సంతోషమింతాఅంతా కాదు.

"కారు రిపేరు చేయించి ఉంటే సమయానికి అక్కరకొచ్చేది కదా! మీకు పెద్దవాళ్ళ మాటలంటే విలువుండదు. పోనీలే ఏంచేస్తాం? పద, రిక్షాలో పోదాం!" అంది విమలమ్మ.

"ఎందుకమ్మా? శాంతకింకా బజార్లో చాలాపనులున్నాయి. ముందవన్నీ పూర్తిచేయమంటాను. ఇప్పుడు మెకానిక్‌కి ఫోన్ చేస్తే ఇంటికొచ్చి స్కూటరు బాగుచేసి ఆతర్వాత కారు సంగతి కూడా చూస్తాడు" అంటూ రామారావు లోపలికివెళ్ళి ముందు బట్టలదుకాణానికీ తర్వాత తనకు తెలిసిన గ్యారేజికీ ఫోన్ చేశాడు.

ఓ గంటలో స్కూటరు బాగుపడింది. మెకానిక్కునీ, పాతకారునీ నారాయణరావుకప్పజెప్పి తల్లీకొడుకులిద్దరూ స్కూటరు మీద బయల్దేరారు.

"నీ స్కూటరు కాబట్టి క్షణాలమీద రిపేరు చేయించుకున్నావు. నాన్నగారు కారు గురించి నీవు చేసిన నిర్లక్ష్యానికెంతో బాధపడుతున్నారు" అంది విమలమ్మ.

"నాన్నగారికేం బాధలేదమ్మా! ఉంటే ఆయనే ఫోన్‌చేసి మెకానిక్కుని రప్పించుకునేవారు" అన్నాడు రామారావు.

"ఆయన సంగతి సరే—పోనీ నీకేం బాధ లేదా—ఆయన విషయం నిర్లక్ష్యం చేసినందుకు" అంది విమలమ్మ.

"ఇందులో నిర్లక్ష్యానిదేముంది? అంతా అవసరాన్నిబట్టి చేసుకుంటాం. స్కూటరు రిపేరు చౌక. అయ్యే పెట్రోల్ తక్కువ. ఈ ఊళ్ళో అది లేకపోతే క్షణం గడవదు. దాన్ని ఒక్క నిమిషం కూడా రిపేరుకుంచలేం. కాదంటావా?" అన్నాడు రామారావు.

విమలమ్మకు అప్రయత్నంగా కొడుకు మాటల్లో తననూ, కోడలినీ పోల్చినట్లపించింది. తనకు జబ్బు చేస్తే కోడలు తనకు సేవలు చేస్తుంది. కోడలికి జబ్బు చేస్తే ఆఫీసుకుపోయే భర్త, వయసుమళ్ళిన తనూ, తన భర్తా—వీరిలో ఎవరు సేవలు చేయగలరు.

కొడుకు తనను నిర్లక్ష్యం చేయడంలేదు. అవసరానికి ప్రాముఖ్యతనిస్తే అది అమానుషం కాదు.

ఈ విషయం గ్రహింపుకు రాగానే విమలమ్మ బట్టల ఎన్నిక అయ్యాక ఇంటికి కోడలితో కలిసి రిక్షాలోనే తిరిగివెళ్ళింది.